RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 290 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 23 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# ఆగస్టు 15లోపే రుణమాఫీ




## పసుపు బోర్డు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం

### నిజామాబాద్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్: చక్కెర ఫ్యాక్టరీని తెరిపించే బాధ్యత మాది అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి వ్యవసాయ మంత్రి అవుతారని పేర్కొన్నారు. కేంద్రంలో ఉండే పెద్దలను ఒప్పించి మంత్రి పదవి ఇప్పిస్తానని స్పష్టం చేశారు. పంద్రాగస్టులోపు రుణమాఫీ ఇస్తామని, బాసర సరస్వతీ మాత మీద ఒట్టు వేసి మరి చెప్పారు. వరి పంటకు రూ.500 బోనస్ అందజేస్తామని మరోసారి స్పష్టం చేశారు. 2021 జనవరి 30న రైతు సమస్యలపై ఆర్మూర్‌లో చేపట్టిన దీక్ష తర్వాతే నాకు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చిందని వివరించారు. ఆరునూరైనా సరే సెప్టెంబర్ 17 లోపల నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీనిచ్చారు. '2014లో నిజామాబాద్ నుంచి కవిత గెలిచాక రైతులను పట్టించుకోలేదు. వంద రోజుల్లో షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని చెప్పి కవిత మాట తప్పారు. అందుకే ఈ ప్రాంత రైతులు కవితను రాజకీయ సమాధి చేశారు. అర్వింద్ కూడా మాట తప్పారు. పసుపు బోర్డు ఎక్కడ పెడతారో జీవోలో చెప్పలేదు. స్పైసిస్ ఆఫీస్ తెచ్చి పసుపు బోర్డు అని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏది ఒరిజినలో, ఏది డూప్లికేటో రైతులకు తెలుసు. పంజాబ్, హర్యానా రైతులతో సమానంగా ఆత్మ గౌరవంతో బతికే వారు నిజామాబాద్, ఆర్మూర్ రైతులు. రాబోయే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం.. జీవన్ రెడ్డి కేంద్ర వ్యవసాయ మంత్రిగా చేస్తారు. కేంద్ర పెద్దలను ఒప్పించి మెప్పించి ఈ మంత్రి పదవి ఇప్పిస్తా అని' రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ఒక్కోసారి ఓటమి కూడా గెలుపునకు నాంది అవుతుంది. అందుకు నేనే ఉదాహరణ. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలీసులతో నన్ను నిర్బంధించారు.. ఓడించారు. తిరిగి మల్కాజ్ గిరి పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలిచాను. అప్పుడు ఓడిపోయినందునే ఇప్పుడు సీఎం వరకు ఎదిగాను. జీవన్ రెడ్డి కూడా ఎమ్మెల్యేగా ఓడిపోయినా ఎంపీగా గెలుస్తాడు. కవిత గురించి మాట్లాడేది ఏమీ లేదు.. అంతా మీకు తెలుసు అని' రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'ప్రధాని మోదీ రెండు మతాల మధ్య చిచ్చు పెట్టాలని అనుకుంటున్నారు. ఓడిపోతామనే భయంతో మత విద్వేషాలు రెచ్చ గొడుతున్నారు. హిందువుల ఆస్తులు గుంజుకుని ముస్లింలకు పంచుతామని అంటున్నారు. ఇది సాధ్యమా? ఇలాంటి చట్టాలు దేశంలో లేవు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెలో ఉండాలి. మత సామరస్యం కాపాడాలనేది మన సంప్రదాయం. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. ఇండియా కూటమి గెలిస్తే దేశానికి మంచిది. బాసర సరస్వతీ మాత మీద ఒట్టేసి చెబుతున్నా.. 15 ఆగస్టు లోపల రెండు లక్షల రుణమాఫీ చేస్తాం. 500 బోనస్ ఇచ్చి ధాన్యం కొంటాం. నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న ఈ గడ్డ. జీవన్ రెడ్డిని గెలిపించి ఓ రైతును పార్లమెంటు కు పంపాలని వేడుకుంటున్నా అని' సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## మోదీ హవాతో తెలంగాణలో భాజపా క్లీన్ స్వీప్: పీయూష్ గోయల్



చేవెళ్ల: తెలంగాణలో హైదరాబాద్ సహా మెజార్టీ స్థానాల్లో భాజపా గెలువబోతుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎన్డీయే కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల్లో ఐకమత్యం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ కేరళలో సీపీఐతో కుస్తీ.. దిల్లీలో దోస్తీ చేస్తోందని ఎద్దేవా చేశారు. 2047 నాటికి వికసిత్ భారతే తమ లక్ష్యమన్నారు. మోదీ హవాతో ఈ ఎన్నికల్లో తెలంగాణలో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం చేవెళ్ల లోక్‌సభ స్థానానికి భాజపా అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. రాజేంద్రనగర్‌లోని ఆర్వో కార్యాలయంలో ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలే: సీఎం రేవంత్‌రెడ్డి



ఆదిలాబాద్: తెలంగాణలో ఐదు గ్యారంటీలు అమలు చేశామని, త్వరలోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కూడా పూర్తిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన మాట్లాడారు. "నాగోబా జాతరకు రూ.4 కోట్లు కేటాయించనున్నాం. కుప్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేస్తాం. తుమ్మిడిహట్టిలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కడతాం.. దానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెడతాం. ఆదిలాబాద్‌లో కొత్త యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం.

మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలే. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అన్నదాత పండించిన ప్రతి గింజ కొంటున్నాం. ఉచిత బస్సుల్లో 35 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. పదేళ్లలో కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వకుంటే.. కాంగ్రెస్ 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చింది. బీసీ జనగణన చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ ఉన్న సీసీఐ సిమెంట్ పరిశ్రమను మోదీ, కేసీఆర్ కలిసి మూసేశారు. తొందరల్లోనే దీన్ని తెరిపిస్తాం. రూ.500కే మేం గ్యాస్ సిలిండర్ ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని వాళ్లిద్దరూ అంటున్నారు. ఉచిత కరెంటుతో పేదల ఇళ్లు వెలుగుతుంటే వాళ్ల కడుపు మండుతోంది. గత ప్రభుత్వ పాలనలో పండించిన ధాన్యం కొనకపోవడంతో రైతులు కల్లాల్లోనే చనిపోయారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.




# అంత సులువేమీ కాదు!?

## ఆ ఆరు రాష్ట్రాల్లో బిజెపికి ఎదురీతేనా!?

### చాపకింద నీరులా విస్తరిస్తున్న 'ఇండియా' కూటమి!!

న్యూఢిల్లీ : దేశంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పలు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా, కేంద్రంలో అధికారంలోకి రావటం కోసం రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఫోరం, అధికార బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ పోటీ పడుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏకంగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఏకు 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అంటూ నినదాలు హోరెత్తిస్తున్నారు. బిజెపికే 370కి పైగా సీట్లను వస్తాయంటూ గొప్పలు వల్లె వేస్తున్నారు. అయితే, మోడీ, బిజెపి శ్రేణులు అనుకుంటున్నట్టుగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు లేవని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 'ఇండియా' ఫోరం ఏర్పాటుతో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు బలపడ్డాయని వారంటున్నారు. పదేళ్ల పాలనలో బిజెపి ప్రజలకు చేకూర్చిన ప్రయోజనాలేమీ లేవని, ధరాఘాతం, నిరుద్యోగం వంటి సమస్యల నేపథ్యంలో మోడీ సర్కార్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అందువల్ల మోడీ నినాదం పగటి పూట కలగా మిగిలిపోతుందని వారంటున్నారు. ప్రీపోల్ సర్వే ఫలితాలకు భిన్నంగా.. 2004 లోక్‌సభ ఎన్నికల నాటి పరిస్థితులు రిపీట్ అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, కేంద్రంలో కొత్త ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకోవటంతో 2014 ఎన్నికల్లో మోడీ నేతృత్వంలోని బిజెపి గతంలో ఎన్నడూ లేనంత మెజారిటీ సీట్లను సొంతం చేసుకొని అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్న సమయం లోనే బిజెపి 2014 ఎన్నికల్లో 282 సీట్లు, 2019 ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయం సాధించిందనీ, ఈ సారి ఎన్నికల్లో మాత్రం మోడీ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత ఉన్నందున 'చార్ సౌ పార్' అనేది కాషాయపార్టీకి సాధ్యం కాదని అంటున్నారు.

**ఆరు రాష్ట్రాల్లో 193 లోక్‌సభ స్థానాలు :** మోడీ చేస్తున్న చార్ సౌ పార్ నినాదానికి మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్, కర్నాటక, జార?ండ్, ఒడిషా రాష్ట్రాలు కొరకరాని కొయ్యగా మారాయని చెప్తున్నారు. ఈ ఆరు రాష్ట్రాల్లో మొత్తం 193 ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ ప్రతిపక్ష పార్టీలు సైతం చాలా బలంగా ఉన్నాయి. మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో ఎన్‌డిఏ కూటములే అధికారంలో ఉన్నా.. బిజెపి వ్యక్తి మాత్రం ముఖ్యమంత్రి స్థానంలో లేరు. ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో సహా అక్కడి స్థానిక పార్టీల నుంచి బిజెపికి తీవ్ర పోటీ ఎదురు కానున్నదని రాజకీయ, ఎన్నికల విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ తృణమూల్ కాంగ్రెస్, ఒడిశాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజెడి వంటి ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో రెండు ప్రాంతీయ పార్టీలకు బలం బాగానే ఉన్నది. కర్నాటకలో కాంగ్రెస్, జార?ండ్‌లో జెఎంఎం-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాలున్నాయి. ఇక్కడా పోటీ తీవ్రంగానే ఉంటుంది.

**గతంలో బిజెపిని గట్టెక్కింది ఆ 12 రాష్ట్రాలే...** 2019 లోక్‌సభ ఎన్నికల్లో 'పుల్వామా' ఉగ్రదాడులు, బాలాకోట్ సర్జికల్ స్ట్రైక్ అంశాలు బిజెపికి అనుకూలంగా మారాయి. ఈ అంశాలు ప్రజల్లో తీవ్ర భావోద్వేగాన్ని రగిల్చాయి. 2014 ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతాన్ని పెంచుకున్న బిజెపి మరో 21 సీట్లకు ఎగబాకి 303కు చేరింది. బీహార్, మధ్యప్రదేశ్, కర్నాటక, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, యూపీ, ఛత్తీస్‌గఢ్, హర్యానా, అసోం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి 12 రాష్ట్రాలలో ఉన్న మొత్తం 320 సీట్లలో దాదాపు 278 సీట్లను గె లుచుక్నుది. అయితే, మిగిలిన 25 సీట్లను ఇతర రాష్ట్రాలలో అతి కష్టం మీద గెలిచింది. ఈ సారి ఎన్నికల్లో మాత్రం ఈ 12 రాష్ట్రాలలో నూ బిజెపికి వ్యతిరేకంగా పరిస్థితులు ఏర్పడ్డాయనీ, ఇక్కడ నుంచి ఎంపీ సీట్లు గెలవటం కాషాయపార్టీకి అంత సులువేం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**అన్ని తరగతుల్లోనూ వ్యతిరేకత :** 2019 ఎన్నికల్లో 224 స్థానాల్లో బిజెపి 50 శాతానికి పైగా ఓట్లను సాధించింది. ఈ 224 సీట్లలో ఎక్కువ భాగం కూడా బిజెపికి బలం ఉన్న పై 12 రాష్ట్రాల నుంచి వచ్చాయి. కానీ ఇప్పుడు 'ఇండియా' ఫోరం ఏర్పడింది. పుల్వామా లాంటి రెచ్చగొట్టే భావోద్వేగ అంశాలు ఈ సారి లేవు. పైగా బిజెపి మీద ప్రజలు, యువత, మహిళ, మైనారిటీలు, దళితులు, కార్మికులు, రైతులకు తీవ్ర కోపమున్నదనీ, కాషాయ పార్టీ ప్రభుత్వంపై ఈ వ్యతిరేకత కారణంగా మోడీ 'చార్ సౌ పార్' లక్ష్యానికి గండి పడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని విశ్లేషకులు చెప్తున్నారు. ఒకవేళ 50 శాతానికి పైగా ఓట్లు వచ్చిన ఆ 224 స్థానాలనే ఈ సారి కూడా బిజెపి గెలిచిందనుకున్నా.. తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉన్న, క్షేత్రస్థాయిలో బలం లేని మిగతా రాష్ట్రాల నుంచి ఆ పార్టీ 370కి కావాల్సిన మిగిలిన సీట్లను సాధించడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.

**'దక్షిణాది'లో అందని ద్రాక్షే ....** ముందుగా చెప్పిన ఆరు రాష్ట్రాల్లోని నాలుగు రాష్ట్రాలు కర్నాటక, బీహార్, మహారాష్ట్ర, జార?ండ్‌లో కొత్త రాజకీయ సవాళ్లు ఏర్పడ్డాయి. మిగిలిన రెండు రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, ఒడిశాలో ఇప్పటికే మోడీకి వివిధ స్థాయిలలో ప్రతిఘటనను అందించాయని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. దక్షిణాదిన ఉన్న తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళలోని దాదాపు 100 సీట్లు బిజెపికి అందని ద్రాక్ష వంటివేనని చెప్తున్నారు. కనీసం 2019లో వచ్చిన 303 సీట్లనైనా దాటడానికి ముందుగా పేర్కొన్న ఆరు రాష్ట్రాల నుంచి మరో 100 లేదా అంతకంటే ఎక్కువ స్థానాలను బిజెపి గెలవాల్సిన అవసరం ఉంటుంది. ఆ ఎన్నికల్లో బిజెపి 102 సీట్లను ఈ ఆరు రాష్ట్రాల నుండి కైవసం చేసుకున్న కారణంగానే 303 కు చేరుకోగలిగింది. మహారాష్ట్ర, బీహార్‌లో..బిజెపికి బలమైన మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలు చాలా బలహీనంగా ఉన్నాయి. శివసేన విడిపోయింది. రాజకీయ స్థిరత్వం లేని నితీశ్ నేతృత్వంలోని జెడియు.. బీహార్‌లో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. నితీశ్‌ను బిజెపి మళ్లీ అక్కున చేర్చుకోవటం కూడా పెద్ద మైనస్‌గా మారనుందని విశ్లేషకులు చెప్తున్నారు. కర్నాటక, జార?ండ్‌లలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. దాని మిత్రపక్షాలతో రెట్టించిన ఉత్సాహంతో ఉన్నదని అంటున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## తెలంగాణలో బీజేపీకి అంత సీనుందా ?

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో దక్షిణాది నుండి అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని బీజేపీ అధిష్టానం భావిస్తున్నది. ముఖ్యంగా కర్ణాటక, తెలంగాణ మీద ఎక్కువ ఆశలు పెట్టుకున్నది. తెలంగాణలో మొత్తం 17 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. అందులో 12 స్థానాలలో గెలుపు సాధిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. గతంలో ముషీరాబాద్ ఎమ్మెల్యేగా ఓడిపోయి ఓబీసీ కోటాలో రాజ్యసభ సభ్యత్వం దక్కించుకున్న లక్ష్మణ్ మాట్లాడుతూ "సొంత ఎమ్మెల్యేల మీద నమ్మకం లేని రేవంత్ రెడ్డికి అంత అభద్రతా భావం ఎందుకని, వంద రోజుల పాలన రెఫరెండంగా భావించి 14 లోక్ సభ స్థానాలు గెలుస్తామన్న రేవంత్ ఇప్పుడు ఎందుకు మొసలి కన్నీరు కారుస్తున్నారని" ప్రశ్నించారు. కేసీఆర్ బస్సు యాత్ర చేసినా, మోకాళ్ల యాత్ర చేసినా తెలంగాణ ప్రజలు అసలు నమ్మరని విమర్శించారు. లోక్ సభ ఎన్నికలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందంతో పనిచేస్తున్నాయని విమర్శించారు. ఇది ఇలా ఉంటే తెలంగాణలో గత శాసనసభ ఎన్నికలలో బీజేపీ 8 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. మిగిలిన స్థానాలలో కనీసం లోకల్ క్యాడర్ కూడా బీజేపీకి అందుబాటులో లేదు. హైదరాబాద్ వంటి కీలకస్థానంలో ఉన్న ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఇప్పటి వరకు పార్టీ అభ్యర్థి మాధవీలతకు సహకరించడం లేదని పార్టీ అధిష్టానం గుర్రుగా ఉంది. ఇక హైదరాబాద్ స్థానంలో నిలపడానికి బీజేపీ మొగోడు దొరకలేదా ? అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడి నుండి 12 స్థానాలు గెలుస్తామని బీజేపీ ఆశించడం పార్టీ వర్గాలలో చర్చకు తెరలేపింది. గతంలో గెలిచిన నాలుగు స్థానాలు గెలవడమే కష్టమని, ఇప్పటికే బండి సంజయ్, ధర్మపురి అరవింద్ శాసనసభ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయారని, ఇప్పటికైనా పార్టీ వాస్తవ పరిస్థితులు గుర్తెరిగి గతంలో ఉన్న స్థానాలను గెలుచుకునేలా వ్యూహరచన చేయాలని పార్టీ వర్గాలు కోరుతున్నాయి.

## నేతన్నల భూములపై అక్రమార్కుల కన్ను



వరంగల్ : నేతన్నలు చెమటోడ్చి మగ్గంపై శ్రమిస్తేగానీ పూట గడవదు. అలా వారు రూపాయి రూపాయి పోగు చేసి కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలాలను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. జనగామ పట్టణ పరిధిలో చేనేత సొసైటీ ఏర్పాటుచేసుకొని పట్టాలు చేసుకున్న జాగలపై కొందరు పెద్దల కన్ను పడింది. రూ.కోట్ల విలువైన ఈ భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. నిబంధనలు అతిక్రమించి పట్టాలు చేసుకుంటూ నేతన్నల పొట్టలు కొడుతున్నారు. పట్టణం సమీపంలో ఉన్న 'ది భారత్ టెరీకాటన్ అండ్ జరీబార్డర్ చేనేత సహకార, అమ్మకం సొసైటీ' భూములు అన్యాక్రాంతమవుతున్న తీరుపై ప్రత్యేక కథనం.

జనగామ, పరిసర 30 గ్రామాల నిరుపేద చేనేత కార్మికులు నివేశన స్థలాల కోసం స్థానిక 'ది భారత్ టెరీకాటన్ అండ్ జరీబార్డర్ చేనేత సహకార, అమ్మకం సొసైటీ' ఆధ్వర్యంలో జనగామ పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 314లో 12 ఎకరాల భూమి కొనుగోలుకు రైతుల నుంచి ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత అదే సర్వేనెంబరులో 9.14 ఎకరాల భూమిని ఖరీదు చేసి 1989 జూన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. చట్టపరమైన రక్షణ కోసం ఆ భూమిని సొసైటీ ద్వారా ప్రభుత్వానికి అప్పగించారు. 120 గజాల చొప్పున 248 ప్లాట్లను మండల రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో అప్పట్లో లేఔట్ కూడా చేశారు. 252 మందికి అప్పటి తహసీల్దార్ 1994లో పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది ప్రభుత్వ భూమిగా నమోదవడంతో గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు మంజూరు చేయించేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. ఇదిలా ఉండగా కొందరు కబ్జాదారులు వీటిపై కన్నేసి ప్రభుత్వ భూమి అయినప్పటికీ కొందరు పేద కార్మికుల నుంచి ప్లాట్లు కొని అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రస్తుతం ఎకరా సుమారు రూ.2 కోట్ల వరకు పలకడంతో సొసైటీలో కొందరు అక్రమాలకు తెరతీశారు.

### 948 గజాల స్థలం రిజిస్ట్రేషన్

సొసైటీ ప్రతినిధి ఒకరు, సొసైటీ డైరెక్టర్ పేరిట ఇదే భూమి నుంచి 948 గజాల స్థలాన్ని గతేడాది ఆగస్టులో విక్రయించి రిజిస్ట్రేషన్ పూర్తి చేయడంతో చేనేతలు తాము అన్యాయానికి గురవుతున్నామని గ్రహించారు. పట్టా చేసిన స్థలంలో ఎవరెవరి ప్లాట్లు ఉన్నాయో తెలియక కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్మికుల భూమికి దారి లేనందునే పక్క రైతు నుంచి దారి తీసుకొని ఈ స్థలాన్ని అప్పగిస్తున్నామని మాయమాటలు చెబుతూ స్థలాలను కాజేసే యత్నం చేస్తుండడం గమనార్హం. దీంతో కార్మికులు, సంఘం బాధ్యులు న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు.

### అధికారులకు ఫిర్యాదు

కార్మికులకు పట్టాలిచ్చిన భూమిలో అక్రమాలపై విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలు తొలగించాలని, పాత లేఔట్‌ను అనుసరించి ప్లాట్లు గుర్తించాలని చేనేత కార్మికుల తరఫున సామాజిక కార్యకర్త, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కూరపాటి శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ బొంతపల్లి నాగరాజు, కొండ కిరణ్‌లు కలెక్టర్‌కు, జనగామ డీసీపీ, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు దృష్టిసారించి, నిబంధనల ప్రకారం చేనేతలకు ప్లాట్లు అప్పగిస్తే ఎంతో మందికి న్యాయం జరుగుతుంది.

### గతంలోనే ఫిర్యాదు

ఈ స్థలంలో ప్లాట్ల క్రయ, విక్రయాలను నిలువరించాలని 2014లో సొసైటీ బాధ్యులు రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు ఇచ్చారు. 9.14 ఎకరాల భూమిలో సుమారు 30 వేల గజాల స్థలాన్ని ప్లాట్లుగా చేసి, మరో 15 వేల గజాల వరకు అంతర్గత రహదారులకు, ఇతర అవసరాలకు కేటాయించారు. ఇదే అదనుగా సొసైటీకి చెందిన కొందరు కార్మికుల వద్ద నుంచి డబ్బు తీసుకుని అక్రమంగా మరికొందరికి పట్టా సర్టిఫికెట్లు ఇప్పించారు. ఒరిజినల్ పట్టాలున్నా, ఈ భూమివైపు చూడని వారి పట్టా సర్టిఫికెట్లలో వివరాలు మార్చి అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి. కొందరు సొసైటీ ప్రతినిధుల పేరిట పావులు కదుపుతున్నారు. సొసైటీ సభ్యులు తమకు న్యాయం చేయాలని ప్రశ్నిస్తే 120 గజాల చొప్పున స్థలం రాదని, 80 గజాల చొప్పున వస్తుందని బుకాయిస్తున్నారు.

## నేర నియంత్రణకు సైబర్ వారియర్స్




ములుగు : ప్రస్తుత కాలంలో చరవాణి లేనిదే రోజు గడవడం లేదు. అదే సమయంలో డిజిటల్ లావాదేవీలు పెరిగిపోవడంతో.. చాలా మంది స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరాలు హెచ్చుమీరుతున్నాయి. పలు రకాల ఆఫర్లు, ప్రలోభాల పేరిట అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వీటిని నియంత్రించడానికి పోలీసు శాఖ ఇప్పటికే అనేక ప్రయత్నాలు చేస్తున్నా.. అడ్డుకట్ట పడటం లేదు. ఈ నేపథ్యంలో బాధితులకు మెరుగైన సేవలందించేందుకు 'సైబర్ వారియర్స్' పేరిట సిబ్బందిని అందుబాటులోకి తెచ్చింది.

సైబర్ మోసానికి గురైన బాధితులు టోల్ ఫ్రీ నెంబరులో ఫిర్యాదు చేస్తున్నారు. ఘటన చోటు చేసుకున్న తర్వాత ఎంత త్వరగా సమాచారం ఇవ్వగలిగితే అంతే వేగంగా నేర నియంత్రణకు వీలుంటుంది. ఆలస్యమైతే పరిస్థితి జఠిలమే. రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది బాధితులు టోల్ ఫ్రీ నెంబరును ఆశ్రయిస్తుండటంతో.. సహాయ కేంద్రాల సంఖ్యను పెంచారు. అయినప్పటికీ.. విపరీతమైన ఫోన్ కాల్స్ పెరిగిపోయాయి. దీంతో సత్వర సేవలను అందించేందుకు పోలీసు శాఖ సిబ్బందిని ఎంపిక చేసి రాష్ట్రవ్యాప్తంగా సైబర్ వారియర్స్‌ను సిద్ధం చేశారు.

ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు జిల్లా పరిధిలో 40 ఫిర్యాదులు అందాయి. బాధితులు రూ.19.68 లక్షలు మోసపోయారు. ఇప్పటివరకు 12 ఫిర్యాదులకు సంబంధించి రూ.3.35 లక్షలు పోలీసులు రికవరీ చేశారు.

### ప్రత్యేక విభాగం ఏర్పాటు

జిల్లాలో సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో నేర నియంత్రణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. వీరు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో పనిచేస్తారు. ఇందులో ఒక డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ముగ్గురు పోలీసు సిబ్బంది ఉంటారు. వీరు సైబర్ మోసాలపై అవగాహన సదస్సులతో ప్రజలను అప్రమత్తం చేస్తారు. మోసానికి గురై డబ్బు కోల్పోయిన బాధితులకు తిరిగి పొందడంలో.. సాయం చేస్తారు.

### హైదరాబాద్‌లో శిక్షణ

ఈ ప్రక్రియలో ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా ప్రతి ఠాణాలో ఒక సైబర్ వారియర్‌ను నియమించారు. జిల్లా పరిధిలో మొత్తం పది పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీరికి హైదరాబాద్‌లో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. అందరికి సిమ్ కార్డులు, చరవాణులు అందజేశారు. స్టేషన్ల వారీగా ఆ నంబర్లు అందరికీ తెలిసేలా ప్రచారం చేస్తున్నారు.

### ఏం చేస్తారంటే..

సైబర్ నేరాలకు సంబంధించి ఎలాంటి కేసులున్నా వీరిని సంప్రదిస్తే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తారు. అదే సమయంలో కేసుల ప్రస్తుత పరిస్థితిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తారు. ఎవరైనా 1930కి కాల్ చేసినా.. అక్కడి నుంచి బాధితులున్న పోలీస్ స్టేషన్ పరిధిలోని సైబర్ వారియర్స్‌కు సమాచారం అందుతుంది. దీంతో వారు ఏం చేయాలో బాధితులకు సూచిస్తారు.

### లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలి : శబరీష్, ఎస్పీ

సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం పార్ట్‌టైం ఉద్యోగాలు, బెట్టింగ్, ఆన్‌లైన్‌లో పెట్టుబడి, ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. లింకులు పంపిస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తారు. ఓటీపీలు చెప్పడం, లింకుల జోలికి వెళ్లడం వంటివి చేయకూడదు. ఇతరులకు డబ్బులు పంపే క్రమంలో ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. సైబర్ మోసాలకు గురైతే ఆందోళన చెందకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

## సమాచారమంతా తెరపైనే

చెన్నూరు : ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పక్కాగా ఏర్పాట్లు చేస్తోంది. ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ అక్షరాస్యత విపరీతంగా పెరిగింది. ఈ క్రమంలో ఎన్నికల సంఘం సాంకేతికత సహాయంతో ఈ ప్రక్రియను సజావుగా జరిపేందుకు అడుగులు వేస్తోంది. ఓటర్లు నేరుగా ఇంటి నుంచే ఎన్నికల విషయాలు తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఓటర్లు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలు అరికట్టేందుకు, అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు ఇలా ప్రతి సమాచారం అందుబాటులో ఉంచుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు సైతం ఆన్‌లైన్ ద్వారానే సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అవకాశం కల్పించింది. భారత ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకం

వృద్ధులు, దివ్యాంగుల కోసం సక్షం యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేనివారు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. అలాంటి వారి వివరాలను అధికారులు పరిశీలించి పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు రవాణా సదుపాయం కల్పిస్తారు. వారికి ప్రత్యేకంగా ఒక స్వచ్ఛంద సహాయకుడిని అందుబాటులో ఉంచుతారు. దివ్యాంగులకు మూడు చక్రాల కుర్చీ వంటి సదుపాయాలు సమకూరుస్తారు.

ఓటరు హెల్ప్‌లైన్‌లో సమస్తం..ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా అనేక సేవలు పొందవచ్చు. జాబితాలో పేరును చూసుకునేందుకు కొత్త ఓటు నమోదు, ఓటు బదిలీ, తప్పులు సరిచేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఎన్నికలకు సంబంధించి సేవలు, ఫిర్యాదులు కూడా దీని ద్వారా చేసుకోవచ్చు. ఓటరు గుర్తింపుకార్డును డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా పొందవచ్చు.అభ్యర్థి ఎవరో తెలుసుకునేందుకు..అందరికీ వారి నియోజకవర్గంలో ఎంతమంది ఎన్నికల బరిలో తలపడనున్నారనే విషయం తెలియదు. అలాంటి వారి కోసం నో యువర్ క్యాండిడేట్(కేవైసీ) అనే వెబ్‌సైట్ ఉంది. దీని ద్వారా పోటీ చేసే అభ్యర్థి విద్యార్హతలు, వారికి నేరచరిత్ర ఏమైనా ఉందా? ఎక్కడెక్కడ ఎంతమేర ఆస్తులు ఉన్నాయి. స్థిర, చర ఆస్తులు, ఇతర వివరాలన్నీ ఉంటాయి.

## నాకింత... నీకింత

నారాయణపేట : పేట జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొంతమంది రోగులకు సంబంధించి ప్రయివేటులో రక్త పరీక్షలు చేసుకున్నట్లు ఇటీవల ఆకస్మిక సందర్శనకు వెళ్లిన కలెక్టర్ శ్రీహర్ష దృష్టికి వచ్చింది. అసలు ప్రైవేటుగా రక్త పరీక్షలు ఎందుకు చేయిస్తున్నారని వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండు రోజుల కిందట ఓ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యుడు హెర్నియా ఆపరేషన్‌కు సంబంధించి ఏవేవో రక్త పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు. ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రంలో వైద్యుడు సూచించిన పరీక్షలన్నింటికీ ఏకంగా రూ.3500ల ఫీజు చేశారు. బిల్లు చూసిన ఆ వ్యక్తి నిట్టూర్చాడు.. నారాయణపేటతోపాటు ప్రధాన పట్టణాల్లోని పలు ప్రయివేటు రక్త పరీక్ష కేంద్రాలలో వసూళ్ల దందా కొనసాగుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలతోపాటు టైఫాయిడ్ ఇతరత్రా వ్యాధుల భారినపడిన ప్రజలు తరచూ వైద్యం కోసం మండల, డివిజన్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఎక్కడికి వెళ్లినా ముందుగా రక్త పరీక్షలు చేయించుకోవాల్సిందేనని సూచిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు కేంద్రాల నిర్వహకులు అధిక వసూళ్లకు తెగబడుతున్నారు. కమిషన్లకు కక్కుర్తిపడిన కొందరు ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు అనవసర పరీక్షలకు పురమాయిస్తున్నారు.

జిల్లాలో నారాయణపేట పెద్ద ఆస్పత్రి, మూడు క్లస్టర్ హెల్త్ కేంద్రాలు, 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక అర్బన్‌హెల్త్ కేంద్రం ఉంది. వీటితోపాటు 59 పల్లెదవాఖానాలు, మరో 28 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు అనారోగ్యానికి గురైనా, ఏదైనా వ్యాధిబారిన పడినా ఆస్పత్రులను సంప్రదిస్తున్నారు. ఇందులో చాలా మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తుండగా ప్రైవేటు ఆస్పతుల్రకు అంతేస్థాయిలోనూ వెళ్తున్న పరిస్థితి. రోగి వ్యాధి నయం కోసం వివిధ రక్తపరీక్షలు చేయనుండటంతో ప్రైవేటు రక్త పరీక్షల కేంద్రాల నిర్వహకులు ఆడిందే ఆటగా తయారయ్యింది.

ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాల్లో ఫీజుల వసూళ్లపై అజమాయిషీ పూర్తిగా కొరవడటంతో దందా కొనసాగుతోంది..వాస్తవానికి మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్ల పరీక్షలను వైద్యుల సూచన మేరకు చేయాల్సి ఉంటుంది. వీటికి పెద్దగా ఖర్చుకాదని రూ.400ల వరకు ఉంటుందని, బయటి రక్త పరీక్ష కేంద్రాలలో మాత్రం అదనంగా వసూలు చేస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు.

### కానరాని ధరల పట్టిక..

నారాయణపేటలో 21, కోస్గిలో 12, మక్తల్‌లో 10 రిజిస్టరైన రక్త పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు అనుమతిలేనివి మరిన్ని కొనసాగుతున్నాయి. కేంద్రాల నిర్వాహకులు సీబీపీ పరీక్ష రూ.200, మలేరియా రూ.200లు, హెచ్ఐవీ రూ.300లు, మధుమేహం రూ.100లు, థైరాయిడ్ రూ.500, బ్లడ్ కల్చర్ రూ.1800, యూరిన్ కల్చర్ రూ.600, తెమడ, సెమిన్ కల్చర్ రూ.600ల చొప్పున, సర్జికల్ ప్రొఫైల్ రూ.2800ల ఇలా ఒక్కో పరీక్షకు ధరను నిర్ణయించి అమలుచేస్తున్నారు.ఏ కేంద్రాంలోనూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక ప్రదర్శించడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఎవరికీ కనిపించని చోట పట్టిక పెడుతున్నారు.

### అక్కడికే పంపిస్తారు

జిల్లా వ్యాప్తంగా కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలతోపాటు వైద్యసిబ్బంది తమ వద్దకు వచ్చిన రోగులను ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలకు వెళ్లేలా చూస్తున్నారు. వీరే కాదు.. జిల్లా కేంద్రంలో ఆస్పత్రికి వచ్చిన రోగులకు కొందరు సిబ్బంది ప్రయివేటుగా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తూ పర్సంటేజీలు పొందుతున్నారు.. ఇలా గత కొన్ని నెలలుగా తతంగం కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ వ్యాపారం కొనసాగుతోంది.

### అధిక ఫీజులు వసూలుచేస్తే చర్యలు...

– డా.సౌభాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌వో నారాయణపేట

జిల్లాలోని ప్రయివేటు రక్త పరీక్ష కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు వసూలు చేయాలి. ఇష్టానుసారంగా పరీక్షల పేరుతో అధికంగా వసూలు చేయకూడదు. ఎక్కడైనా రోగుల నుంచి అధికంగా ఫీజులుచేస్తే శాఖాపరంగా చర్యలు చేపడతాం.

## నీటిబొట్టు.. ఒడిసిపట్టి

జన్నారం : జన్నారం మండలంలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలోని మూగజీవాలకు తాగునీటి ఇబ్బంది లేకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండుతున్న ఎండలకు మనుషులే తాగునీటికి అల్లాడిపోతున్నారు. అలాంటిది దట్టమైన అడవిలో ఎండిపోయిన చెట్ల మధ్య అగ్ని గుండాన్ని తలపిస్తున్న వేడిలోనూ వన్యప్రాణులకు తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట రేంజి అధికారిణి సుష్మారావు రోజూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. అనేక చోట్ల ఉన్న కుంటలు, చెరువులను పరిశీలిస్తూనే మరో అయిదు ర్యాంపు వెల్స్ తవ్వించారు. సాసర్ పిట్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. కవ్వాల్ పులులు సంరక్షణ కేంద్రం పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న గుట్టల నుంచి సహజ సిద్ధమైన నీటి ఊటలు ఉబికి వస్తున్నాయి. ఆ నీటిని నిల్వ చేయడానికి చెలమలు తవ్వించారు. ఆ నీటిలో రాలిపడే ఎండిపోయిన ఆకులను బేస్ క్యాంపు సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వన్యప్రాణులు చల్లని నీటిని తాగుతున్నాయి. తాగునీటి కోసం అడవిని వీడాల్సిన పనిలేకుండా పోయింది. తాళ్లపేట రేంజి పరిధిలోని దండేపల్లి, ఊట్ల, నీలాలొద్ది, కోతులగుండం, మహ్మదాబాద్, తుంగమడుగు, తపాల్‌పూర్, చినగుట్ట, ముత్యంపేట, మామిడిలొద్ది, చిగుర్ల ప్రాంతాల్లో సహజసిద్ధమైన నీటి వనరులున్నాయి.

### నిండుగా ఉన్న కుంటలు

అడవి మధ్యలో తవ్వించిన కుంటల్లో నీళ్లు ఇప్పటికీ నిండుగానే ఉంటున్నాయి. చెరువులు, కుంటల్లో ఏటా పూడిక తీసి అందులో నీళు నిలిచేలా చేస్తున్నారు. వర్షపు నీరు కుంటల్లోకి చేరుకొని నిండుకుండను తలపిస్తున్నాయి. ఎత్తైన ప్రాంతంలో కురిసే ప్రతి చినుకు బొట్టు కుంటలు, చెరువుల్లోకి ప్రవహించి జలకళను సంతరించుకున్నాయి. ప్రతి సెక్షన్‌లోనూ చెరువులు, కుంటలు ఉన్నాయి. సోలార్ పిట్స్, సాసర్ వెల్స్, ర్యాంపు వెల్స్ రేంజి పరిధిలో నిండు కుండలను తలపిస్తున్నాయి.

### అయిదు ర్యాంపు వెల్స్ తవ్వించాం

సుష్మారావు, రేంజి అధికారిణి, తాళ్లపేట

తాళ్లపేట రేంజి పరిధిలో నీటి ఎద్దడి నివారణకు ఈ ఏడాది అయిదు ర్యాంపువెల్స్ తవ్వించాను. దీంతో ప్రస్తుతం ఇక్కడ 10 ర్యాంపు వెల్స్ ఉన్నాయి. ప్రతి సాసర్ పిట్‌లోనూ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నాం. ఏ ఒక్క వన్యప్రాణి దాహంతో అల్లాడి పోయే ప్రసక్తే లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నా. ప్రతి నీటి బొట్టును నిలువ చేసేలా చర్యలు చేపడుతున్నాను.

## జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో పగులుతున్న అద్దాలు.. అంతుచిక్కని అనుమానాలు

హైదరాబాద్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో ఆకతాయిలు రెచ్చిపోయారు. వాణిజ్య సముదాయాల అద్దాలను ధ్వంసం చేశారు. ఆయా దుకాణాల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావాలనే కొందరు రాళ్లతో దాడి చేసి అద్దాలను ధ్వంసం చేస్తున్నారంటూ వారు అనుమానం వ్యక్తం చేశారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ తతంగంపై పోలీసులు ఒకేసారి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. గత నెల 20న రాత్రి 7 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని బ్రూక్స్ బ్రదర్ స్టోర్ అద్దాలు ఒక్కసారిగా పగిలిపోయాయి. ఆ తర్వాత గంట వ్యవధిలో స్థానిక వాన్ హ్యూసెన్ స్టోర్ అద్దాలు, ఆ పక్కనే ఉన్న వైట్ క్రో స్టోర్ అద్దాలు, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ 24 సెవెన్ గ్రాసరీ స్టోర్‌కు సంబంధించిన అద్దాలు పగిలిపోయి గాజు



ముక్కలు దుకాణాల్లో చిందరవందరగా పడిపోయాయి. దీంతో కొనుగోలుదారులు భయాందోళనకు గురయ్యారు. ఓ వ్యక్తికి స్వల్పంగా గాయమైంది. మరుసటి రోజు రాత్రి రోడ్‌నంబరు 2లోని ఆరికె సినీప్లెక్స్(పీవీఆర్ మాల్)లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న అద్దాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ఆ తర్వాత కూడా ఈ మాల్‌లో రెండుసార్లు ఇదే ఘటన చోటుచేసుకుంది ఈనెల 4న రాత్రి బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని సూర్య సిల్క్ టెక్స్ క్రియేషన్ స్టోర్ అద్దాలు, 5న రాత్రి స్థానిక అండర్ ఆర్మర్ స్టోర్‌లోని భారీ అద్దాలపైకి రాళ్లు దూసుకురావడంతో ముక్కలయ్యాయి. ఇలా పదికిపైగా సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలపై ఆయా స్టోర్ల మేనేజర్లు ఈనెల 16న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటివరకు 8 కేసులు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే ఇద్దరు క్యాబ్ డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

# రహదారి నిర్మించారు.. సమస్యలు మరిచారు

వేములవాడ : గుంతల రహదారితో ఇబ్బందులు ఎదురవుతుండటంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో పక్కా రోడ్డు నిర్మాణంతో రవాణా సదుపాయం మెరుగైంది. దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. అయితే అధికారులు మిగులు పనులపై దృష్టిసారించడం లేదు. పైగా రహదారి నిర్మాణ సమయంలో ఏర్పడిన సమస్యను పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ- కోరుట్ల ప్రధాన రహదారిలోని రుద్రంగి మండల కేంద్రంలో రహదారి అస్తవ్యస్తంగా ఉంది. గుంతల రహదారి వల్ల వాహనదారులు, స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం రూ. 12.8 కోట్లు మంజూరు చేయడంతో పక్కా రహదారి నిర్మించారు. దీంతో రవాణా సౌకర్యం మెరుగుపడి సమస్య తీరింది. అయితే మిగులు పనులపై అధికారులు దృష్టిసారించడం లేదు. రహదారిని ఎత్తుగా నిర్మించడం వల్ల పలువురి ఇళ్లు, దుకాణాలు



పూర్తిగా కిందకు అయ్యాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీరు ఇళ్లు, దుకాణాల్లోకి వస్తుంది. రహదారి వెంబడి పక్కన ఉన్న కాలనీల్లోకి వెళ్లేందుకు అప్రోచ్ రోడ్లను ఎత్తుగా నిర్మించి తారు వేయకపోవడంతో అది కొత్తగా గురైద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఉన్నప్పటికీ దీపాలు వెలగడం లేదు. పచ్చదనం కోసం, రాత్రి సమయంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాల లైట్లు ఒకదానిపై మరొకటి పడకుండా ఉండేందుకు డివైడర్ మధ్యలో మొక్కలు నాటాల్సి ఉండగా ఆ పనులు కూడా చేపట్టలేదు.

ఇళ్లలోకి నీరు

– పిల్లమర్రి ప్రవీణ్, స్థానికుడు

రహదారి నిర్మాణం ఎత్తుగా చేపట్టారు. నిర్మాణ సమయంలో మా అభ్యంతరాలను పట్టించుకోలేదు. రహదారి ఎత్తుగా ఉండటం వల్ల ఇళ్లు, పలువురి దుకాణాలు కిందకు అయ్యాయి. వర్షాకాలంలో వరద లోపలికి చేరుతుంది. సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి

– మంగ శేఖర్, స్థానికుడు

వీధిలో నుంచి ప్రధాన రోడ్డుపైకి వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి ఎత్తుగా ఉండటం, అప్రోచ్ రోడ్డుపైన తారు వేయకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పలువురు కిందపడుతున్నారు. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు మొక్కలు నాటాలి.

పరిశీలించి పరిష్కరిస్తాం

– సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ

నిబంధనల మేరకు రహదారి నిర్మాణం చేపట్టాం. స్థానికుల సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువల నిర్మాణం, డివైడర్ మధ్యలో మొక్కలు నాటడం, సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ త్వరగా పూర్తయ్యే విధంగా చూస్తాం.

# ఎక్కడిక్కడే నీటి శుద్ధి!



హైదరాబాద్: మహానగరం విస్తరిస్తోంది. శివార్లలో భారీ నిర్మాణాలు వెలస్తున్నాయి. వేసవి కావడంతో నగరంలో నీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా మణికొండ, పుప్పాలగూడ, బండ్లగూడ జాగీర్, నానక్‌రాంగూడ తదితర శివారు ప్రాంతాల్లో భూగర్భ జలాలు లేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇలాంటి ప్రాంతాలకు తాగునీటిని అందించడం పెద్ద సవాలు. దీంతో వీరు నీటికోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. 250- 300 ఫ్లాట్లు ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు ట్యాంకర్ల కోసమే నెలకు లక్షల్లో వెచ్చిస్తున్నారు. జలమండలితోపాటు ప్రైవేటు వ్యాపారులు వాటర్ ట్యాంకర్లు సరఫరా చేస్తున్నప్పటికీ అవి ఎటూ సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిధిలో మినీ నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేసేందుకు జలమండలి ముందుకు వచ్చింది. ఉస్మాన్‌సాగర్-ఆసిఫ్‌నగర్ కాండూట్(నీటిని తరలించే కాలువ)పై మూడు ప్రాంతాలతోపాటు హిమాయత్‌సాగర్ పరిధిలోని బుద్వేల్ వద్ద మరొక నీటి శుద్ధి కేంద్రాన్ని అందుబాటులోకి తానున్నారు. ఈ మినీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల కోసం తాజాగా జలమండలి టెండర్లు పిలవగా 2నెలల్లో పనులు పూర్తి చేయనున్నారు. ఒక్కో కేంద్రాన్ని 3 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో చేపట్టేందుకు రూ. 8 కోట్లు వెచ్చించనున్నారు.

ఎందుకు అవసరం అంటే...


ఉస్మాన్‌సాగర్ సామర్థ్యం 3.900 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 2.530 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హిమాయత్‌సాగర్ సామర్థ్యం 2.967 టీఎంసీలుండగా ప్రస్తుతం 2.080 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ రెండు జలాశయాల నుంచి రోజూ 121 మిలియన్ లీటర్ల నీటిని నగరానికి తరలిస్తున్నారు. నీటిని పంపింగ్ చేసి కాండూట్ ద్వారా ఆసిఫ్‌నగర్, మీరాలం ఫిల్టర్‌బెడ్స్‌లో శుద్ధి చేశాక నగరంలోని రిజర్వాయర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.

మణికొండ, పుప్పాలగూడ, బండ్లగూడ జాగీర్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం తాగునీటి కొరతను దృష్టిలో పెట్టుకొని ఫిల్టర్‌బెడ్స్‌కు చేరకముందే మధ్యలోనే టాప్‌చేసి మినీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేయాలని జలమండలి తాజాగా నిర్ణయించింది.

గతంలో మణికొండ, పుప్పాలగూడ ప్రాంతాల్లో 2ఎంఎల్, 3ఎంఎల్ మినీ నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి వచ్చేనీటిని ప్రస్తుతం ఇక్కడ శుద్ధి చేసి కొన్ని ప్రాంతాలకు అందిస్తున్నారు.

అదనంగా మరో 4 కేంద్రాలు రానున్నాయి. వీటిద్వారా రోజూ 12 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి పుప్పాలగూడ, మణికొండ, బండ్లగూడ జాగీర్‌లో ఓఆర్ఆర్ ఫేజ్-2 కింద నిర్మించిన రిజర్వాయర్లకు అందిస్తారు. అక్కడ నుంచి అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేస్తారు. మరికొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా అందిస్తారు.

# రయమంటూ దూసుకెళ్తూ.. దడ పుట్టిస్తూ



హైదరాబాద్: సాయంత్రం దాటితే చాలు.. రేస్ ట్రాకుల్లా మారుతున్న నగర రోడ్లపై ప్రయాణం వెన్నులో వణుకుపుట్టిస్తోంది. ఖరీదైన కార్లు, బైకులతో దూసుకెళ్లడం.. ఒళ్లు తెలియనంతలా తప్పతాగి బండి నడపడం వెరసి ఎప్పుడు ఏవైపు నుంచి ఏ వాహనం ఢీకొడుతుందో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మందుబాబుల డ్రైవింగ్ వాహనదారులు, పాదచారుల ప్రాణాల మీదకొస్తోంది. పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌లతో నిలువరిస్తున్నా కొందరు మాత్రం అడ్డదారుల్లో రహదారుల మీదకు దూసుకొస్తున్నారు. ఇటీవల రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐటీ ఉద్యోగి రహదారిపై బీభత్సం సృష్టించారు. గంట వ్యవధిలో ఆరు రోడ్డు ప్రమాదాలు చేశాడు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నా నియంత్రించడం సాధ్యపడడం లేదు.

వారాంతాల్లో అమ్మో.. ఖాళీ రోడ్లపై ఆకతాయిలు, పోకిరీలు స్టంట్లుచేస్తూ ప్రమాదాలకు కారణమవుతుంటే.. వారాంతాల్లో మరింత దారుణ పరిస్థితులు ఎదురవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో లైకుల కోసం రేసింగ్‌లు, వేగంగా దూసుకెళ్తూ అవతలి వ్యక్తుల్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. శని, ఆదివారాల్లో ఐటీ కారిడార్, నగరంలోని ఖాళీ రోడ్లపై ఈ తరహా పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఖరీదైన కార్లు, ద్విచక్రవాహనాలపై రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాకే పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. నిందితుల్ని పట్టుకున్నా.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కింద కేసు నమోదుకే పరిమితమవుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలున్నా..

పోలీసులు వారాంతాల్లో తప్పనిసరిగా, మిగిలిన రోజుల్లో హఠాత్తుగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఇవీ నిర్ణీత సమయం వరకే ఉండటంతో తరువాత మందుబాబులు చెలరేగుతున్నారు. అర్ధరాత్రి తర్వాత రోడ్డు ప్రమాదాలకు ఇదీ ఓ కారణం. కొందరు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి ఎక్కడెక్కడ తనిఖీలున్నాయో సమాచారం ఇచ్చుకుంటున్నారని చెబుతున్నారు.

పబ్బుల దగ్గర లేని నియంత్రణ..

పబ్బులు, బార్లలో ఎవరైనా మద్యం అతిగా సేవిస్తే వారు వాహనాలు డ్రైవింగ్ చేయకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యామ్నాయ డ్రైవరు వచ్చేదాకా వారిని నిలువరించడం లేదా క్యాబ్‌లో పంపాలి. ఇటీవల కొత్తఏడాది వేడుకల సందర్భంగానూ పోలీసులు పబ్బులు, బార్ల నిర్వాహకులకు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఇదెక్కడా అమలవ్వడం లేదు. రాయదుర్గం రోడ్డు ప్రమాదంలో ఇదే పరిస్థితి. నిందితుడు ఆరు ప్రమాదాలకు కారణమైన యువకుడు సాయంత్రం తర్వాత ఓ పబ్బులో తాగాడు. పూర్తిగా నియంత్రణ కోల్పోయిన స్థితిలో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు చేశాడు.

దుర్గం చెరువుపై వింత పరిస్థితి దుర్గం చెరువు తీగల వంతెనపై వాహనదారులు తీరుతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించే విధుల్లో ఉంచిన ట్రాఫిక్ పోలీసులకు వింత అనుభవాలు ఎదురవుతున్నాయి. విధుల్లో ఉండే ఇద్దరు కానిస్టేబుళ్లు బ్రిడ్జి పొడవునా ఫొటోలు దిగే సందర్శకుల్ని నియంత్రించడం సాధ్యపడడం లేదు. ముఖ్యంగా మహిళలు వారించినా వినకుండా అసౌకర్యం కల్పిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల బ్రిడ్జిపై హిట్ రండ్ అన్ కేసు నేపథ్యంలో మాదాపూర్ పోలీసులు కవాతు నిర్వహిస్తూ అవగాహన కల్పించినా పరిస్థితిలో మార్పురావడం లేదు. అడపాదడపా రోడ్డు మీద వాహనాలు నిలిపి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

# అక్రమార్కులకు అండదండలు




హైదరాబాద్: భూతగాదాల్లో కొందరు పోలీసులు అడ్డగోలుగా జోక్యం చేసుకుంటున్నారు. స్టాండర్ట్ ఆపరేషన్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రకారమే భూముల సమస్యల్లో ముందుకెళ్లాలని నిబంధనలున్నా.. హద్దు మీరినవారిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు విధిస్తున్నా.. కొందరికి ఇవేవీ తలకెక్కడం లేదు. బాధితులకు అండగా నిలవకుండా, ఆక్రమణదారులకు వంత పాడుతున్నారు. భూముల కబ్జాలపై కొందరు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు. దీంతో బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇవీ ఉదాహరణలు.. ః సైబరాబాద్ కమిషనరేట్‌లోని ఓ ఠాణా పరిధిలో 1996లో ఓ వ్యక్తి 4 ఎకరాలు కొని సేద్యం చేసుకుంటున్నాడు. ఇటీవల ఓ రియల్టర్ ఆభూమిలో రెండెకరాలు ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. భూయజమాని ఫిబ్రవరి 10న ఠాణాలో ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదు. కొద్దిరోజుల తర్వాత రియల్టర్ భూమి ఆక్రమించాడు. బాధితుడు అదేరోజు ఫిర్యాదు చేయగా.. నువ్వే పరిష్కరించుకోవాలని ఎస్ఐ సలహా ఇచ్చాడు. కొన్నిరోజుల పాటు బాధితుడిని వేధించాడు. అతడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు.

రాచకొండలో విశ్రాంత ప్రొఫెసర్ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించాడు. అక్కడి ప్రహరీని కూల్చేశాడు. యజమాని పోలీసులకు ఫిర్యాదుచేయగా, ఎన్నికలు ఉన్నాయని పట్టించుకోలేదు. ఆక్రమణదారు బోరు వేయడం, ఇతర చర్యలకు దిగగా యజమాని మళ్లీ ఎస్ఐని సంప్రదించగా సెటిల్ చేసుకోవాలన్నాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా ప్రహరీని మళ్లీ నిర్మించాలని, ఎవరైనా అడ్డుకుంటే కేసు నమోదు చేస్తామన్నారు.

పోలీసుల వేధింపులపై రైతుల నిరసనపోలీసుల వేధింపులకు నిరసనగా రైతులు పొలాల్లో మండుటెండలో ధర్నాకు దిగిన ఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. రైతుల కథనం ప్రకారం.. మదనపల్లి పాతతండాకు చెందిన వడ్త్యా కిషన్‌కు 3 ఎకరాలు, నెనావత్ దేవుజకు 3 ఎకరాలు, పాత్లావత్ గోబ్ర్యాకు ఎకరా మదనపల్లి రెవెన్యూ పరిధిలో అసైన్డ్ భూములుగా ఉన్నాయి. ముత్తాతల కాలం నుంచి వారు సాగు చేసుకుంటున్న ఈ పొలాల్లోకి రావొద్దని, రెండు వారాలుగా శంషాబాద్ పోలీసులు బెదిరిస్తున్నారు. గురువారం పొలాల్లో ఉన్న రైతులను అదుపులోకి తీసుకోవడానికి వచ్చినట్లు తెలియడంతో తండావాసులు ధర్నాకు దిగారు. పోలీసులు వెనక్కి తగ్గడంతో రైతులు శాంతించారు. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డిని చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేరు.

# పాఠశాలల అభివృద్ధికి నిధులు

భూపాలపల్లి : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సర్కారు నిర్ణయించింది. పాఠశాల యాజమాన్యాల కమిటీల స్థానంలో ఇప్పటికే కమిటీలను నియమించిన విద్యాశాఖ ఇప్పుడు నిధులు సైతం విడుదల చేసింది. బడులు పునఃప్రారరంభమయ్యే నాటికి మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించించడంతో క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు పాఠశాలలను సందర్శించి ప్రతిపాదనలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 450 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా 420 బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో 154 బడుల్లో మరమ్మతులు చేయాల్సి ఉందని గుర్తించి వీటిలో అభివృద్ధి, మరమ్మతు పనులకు రూ. 5.83 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ శాఖ అధికారులు తేల్చారు. ఏటా ప్రధానోపాధ్యాయులు యూడైస్-ప్లస్‌లో బడికి సంబంధించిన సౌకర్యాలు, అవసరాలపై నమోదు చేసిన వివరాల ఆధారంగా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది.

అంచనాల తయారీలో నిమగ్నం

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఇటీవలనే విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, యూడైస్ ప్లస్ వివరాలిచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్ని నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో సౌకర్యాలు, మరమ్మతుల అంచనాల తయారీలో సంబంధిత అధికారులు నిమగ్నమయ్యారు. ఆయా పాఠశాలలను సందర్శించి మరుగుదొడ్లు, తాగునీరు, మైనర్, మేజర్ మరమ్మతులు, గదుల్లో విద్యుత్తు దీపాలు,



బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అంచనాలు తయారు చేస్తున్నారు. జూన్ 10 నాటికి ఈ పనులను పూర్తి చేసి రెండో దశలో 'మన ఊరు మన బడి' కింద ఎంపికైన పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేసేలా అదేశాలున్నాయి. నాణ్యతగా పనులు చేపట్టేలా చర్యలు- రాంకుమార్, డీఈవో. భూపాలపల్లి

ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు సర్కారు నుంచి నిధులు వచ్చాయి. ఇప్పటికే జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీల నియామకం పూర్తయింది. ప్రస్తుతం మండలాల వారీగా పనులు గుర్తించడం, నిధులు కేటాయింపు పూర్తి కావస్తోంది. నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

# ఎన్నికల బరి.. 19వ సారి

రాంనగర్: ఆదిలాబాద్ ఓటర్ల అంతరంగం అంచనాకు చిక్కదు. ఎప్పుడు ఏ పార్టీని గెలిపిస్తారనేది తెలియకుండా ఉంటుంది. గత లోక్‌సభ ఫలితాలను పరిశీలిస్తే.. ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులను లోక్‌సభకు పంపించారు. ఆదిలాబాద్ స్థానానికి 17 సార్లు ఎన్నికలు జరగ్గా, ఉప ఎన్నికతో కలిపితే 18 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ప్రారంభంలో కాంగ్రెస్ పార్టీని తరువాత తెలుగుదేశం, తెరాస, తాజాగా భాజపా అభ్యర్థులను ఓటర్లు ఆదరిం చారు. ప్రస్తుతం జరిగే ఈ ఎన్నికల్లో ఏ పార్టీని గెలిపిస్తారనేది ఆసక్తిగా మారింది. మంత్రిగా ఒక్కరే..

1952 నుంచి పలు పార్టీల నుంచి అభ్యర్థులు పార్లమెంట్‌కు వెళ్లినా ఇప్పటి వరకు కేంద్ర మంత్రిగా కేవలం తెలుగుదేశం పార్టీ నుంచి గెలుపొందిన వేణుగోపాలాచారి పని చేశారు. 1996 నుంచి 1998 వరకు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా పని చేశారు. తరువాత ఇప్పటి వరకు మంత్రిగా ఎవరికి అవకాశం దక్కలేదు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని తొలిసారిగా 2019లో భాజపా దక్కించుకుంది. తిరిగి ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడంపై దృష్టి సారించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ఆచితూచి అభ్యర్థిని ఎంపిక చేసింది. పార్లమెంట్ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఉండటంతో ఈ ఎన్నిక అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మ కంగా మారింది.

అన్ని పార్టీలకు ఆదరణ

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి 17 సార్లు ఎన్నికలు జరగ్గా, కాంగ్రెస్ ఏడు సార్లు, తెలుగుదేశం పార్టీ ఆరుసార్లు, తెరాస రెండు సార్లు గెలవగా, ఇక్కడి నుంచి కాంగ్రెస్ ఐ, సోషలిస్టు పార్టీ కూడా ఒక్కోసారి గెలిచింది. గతంలో జనరల్ స్థానంలో ఉన్న ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం 2009 నుంచి ఎస్టీకి కేటాయించారు ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి జిల్లాలో 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. తొలిసారి ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ గెలిచింది. ఈ పార్టీ నుంచి సి.మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జె.వి.నర్సింగ్‌రావుపై 25 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తరువాత 1957 నుంచి వరుసగా 1980 వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. 1984లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని తెదేపా కైవసం చేసుకున్నా.. మళ్లీ తిరిగి 1989లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 1991 నుంచి వరుసగా తెదేపా తన ఆధిక్యతను చాటుకుంది. 1991లో ఇంద్రకరణ్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచారు. తరువాత వరుసగా వేణుగోపాలాచారి తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచారు. 2004లో జరిగిన ఎన్నికల్లో తెరాస పార్టీ అభ్యర్థి గెలుపొందడంతో ఆ పార్టీ నియోజకవర్గంలో పాగా వేసింది. తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి ఆదరించారు. తరువాత 2009లో తెలుగుదేశం పార్టీని గెలిపించారు. మళ్లీ 2014లో తెరాస పార్టీని ఆదరించారు. ఎన్నికలు జరిగిన ప్రతి సారి నియోజకవర్గ ఓటర్లు విభిన్నమైన తీర్పును ఇచ్చారు. అన్ని పార్టీలను ఆదరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, భాజపా, తెరాసలు పోటీ పడుతుండటంతో గెలుపు ఎవరిదనేది ఆసక్తికరంగా మారింది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంతో ప్రచార పర్వం మొదలైంది. ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు, స్థానిక నేతలను పార్టీలో చేర్చుకోవడంపై దృష్టి సారించారు. నామినేషన్ల ఘట్టం పూర్తి తర్వాత ప్రచారం మరింత ఊపందుకునే అవకాశం ఉంది.




అహ్మదాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ గెలుపు ఖాతా తెరిచింది. గుజరాత్‌లోని సూరత్ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడం, పోటీలో ఇంకెవరూ లేకపోవడంతో దలాల్ విజయానికి మార్గం సుగమమైంది. సూరత్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న నీలేశ్ కుంభనీ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆదివారం తిరస్కరించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో అవకతవకలు జరిగినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌వో వెల్లడించారు. ఆయనకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ నుంచి వేసిన మరో నామినేషన్ కూడా చెల్లనిదిగా ప్రకటించారు. మరోవైపు, ఇదే స్థానం నుంచి పోటీకి దిగిన మిగతా 8 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన సోమవారం వీరంతా పోటీ నుంచి వైదొలిగారు. వీరిలో స్వతంత్రులతో పాటు బీఎస్పీ అభ్యర్థి కూడా ఉండటం గమనార్హం. ఇక, పోటీలో ముకేశ్ దలాల్ ఒక్కరే మిగలడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఆయన విజయంపై ఈసీ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని గుజరాత్ భాజపా అధ్యక్షుడు సీఆర్ పాటిల్ సోషల్ మీడియాలో వెల్లడిస్తూ దలాల్‌కు అభినందనలు తెలియజేశారు. "ప్రధాని నరేంద్ర మోదీకి సూరత్ తొలి కమలాన్ని అందించింది" అని రాసుకొచ్చారు. అటు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ కూడా దీనిపై పోస్ట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో భాజపా చారిత్రక విజయానికి నాంది పడిందని.. ప్రధాని మోదీ నాయకత్వంలో గుజరాత్ సహా దేశవ్యాప్తంగా 400 స్థానాలతో కమలం జయభేరీ మోగిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని మొత్తం 26 లోక్‌సభ స్థానాలకు మూడో విడతలో భాగంగా మే 7వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పుడు సూరత్‌లో ముకేశ్ దలాల్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తే.. ఈ స్థానానికి పోలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉండదు.



## పసుపు బోర్డు ఏర్పాటులో నిజామాబాద్ పేరెక్కడ?: సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్: సెప్టెంబర్ 17లోపు చక్కెర పరిశ్రమను పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'జనజాతర' సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పసుపు బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ పేరు లేదన్నారు.

నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు అని స్పష్టంగా చెప్పకుండా నోట్ విడుదల చేశారని విమర్శించారు. ఎన్నికలు అయ్యాక బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తారో తెలియదన్నారు. "నిజామాబాద్ అంటే నాకు ప్రత్యేక అభిమానం. అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలు పునరుద్ధరణ గురించి ఆలోచించాం. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. కవిత ఎంపీగా ఉన్నప్పుడు ఇక్కడి రైతులను పట్టించుకోలేదు. పసుపు బోర్డు ఏర్పాటుపై బాండు రాసి ఇచ్చి భాజపా ఎంపీ అర్వింద్ మోసం చేశారు.
కేంద్రంలో కాంగ్రెస్ కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. చక్కెర పరిశ్రమ, పసుపు బోర్డులను జీవన్‌రెడ్డి సాధిస్తారు. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. కానీ, మోదీ దేవుడిని, భక్తిని ఓట్లుగా మార్చుకుంటున్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాలంటే మళ్లీ కాంగ్రెస్ గెలవాలి"అని రేవంత్‌రెడ్డి అన్నారు.




దిల్లీ: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపద అంతా మైనార్టీలైన ముస్లింలకు పంచుతుందంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దేశ వనరులపై మైనార్టీలదే తొలి హక్కు అని గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తాజాగా ప్రస్తావించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలను బలపర్చేలా భాజపా ఓ వీడియోను విడుదల చేసింది. యూపీఏ హయాంలో 2006 డిసెంబరు 9న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఓ కార్యక్రమంలో మాట్లాడిన వీడియో అది. "మైనార్టీలు, ముఖ్యంగా ముస్లింలకు అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా వారికి సాధికారత కల్పిస్తూ మేం వినూత్న ప్రణాళికలను తీసుకురాబోతున్నాం. దేశంలోని వనరులపై వారికే తొలి హక్కు ఉండాలి" అని మన్మోహన్ చెబుతున్నట్లుగా దానిలో ఉంది. దీన్ని భాజపా తమ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేస్తూ.. "కాంగ్రెస్‌కు తమ సొంత ప్రధానిపైనే నమ్మకం లేదు" అని వ్యంగ్యాస్త్రాలు గుప్పించింది. 2006లో ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై ఏర్పాటు చేసిన జాతీయ అభివృద్ధి మండలి సమావేశంలో మన్మోహన్ ఈ వ్యాఖ్యలు చేశారు. వీటిపై అప్పట్లోనూ తీవ్ర వివాదం చెలరేగింది. దీంతో నాడు ప్రధానమంత్రి కార్యాలయం వివరణ ఇచ్చింది. ఆయన వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారని, తప్పుగా అర్థం చేసుకుంటున్నారని వెల్లడించింది. "మా సమ్మిళిత ప్రాధాన్యతలు స్పష్టంగా ఉన్నాయి. వ్యవసాయం, నీటిపారుదల, నీటి వనరులు, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులతో పాటు ఎస్సీ/ఎస్టీలు, ఇతర వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు, మహిళలు, పిల్లల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతాం. ఎస్సీ/ఎస్టీల కోసం సమగ్ర ప్రణాళికలను పునరుద్ధరించాలి. అభివృద్ధి ఫలాలను సమానంగా అందుకునేలా మైనార్టీలు, ముఖ్యంగా ముస్లింలకు సాధికారిత కల్పించేందుకు వినూత్న ప్రణాళికలు తీసుకురావాలి. వనరులపై వారికే ప్రథమ హక్కు ఉండాలి" అని మన్మోహన్ తన ప్రసంగంలో తెలిపారని ఆ వివరణలో పేర్కొంది. ఇక్కడ 'వనరులపై తొలి హక్కు' అనే మాటను తాను పైన పేర్కొన్న ప్రాధాన్యత అంశాలతో పాటు ఎస్సీ/ఎస్టీలు, ఓబీసీలు, మైనార్టీలు, మహిళలు, చిన్నారులందరినీ ఉద్దేశించి ఆయన అన్నారని స్పష్టం చేసింది.

## కవిత బెయిల్‌కు అర్హురాలన్న లాయర్లు.. బెయిల్ ఇవ్వొద్దన్న సీబీఐ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయి తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును జడ్జి కావేరి బవేజ మే 2కు రిజర్వ్ చేశారు. కాసేపటి క్రితమే లిక్కర్ స్కామ్‌లో సీబీఐ అరెస్ట్‌లో కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ కోర్టులో విచారణ జరుగగా... కవిత తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలన్నారు. అరెస్ట్ నుంచి విచారణ వరకు ఎటువంటి మెటీరియల్ లేదన్నారు. ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారని కోర్టుకు తెలిపారు. ఈడి కస్టడీలో ఉన్నామని.. సీబిఐ ఎందుకు అరెస్ట్ చేసిందని లాయర్ ప్రశ్నించారు. అరెస్ట్ చెయ్యాల్సిన అవసరం లేదన్నారు. పార్టీకి స్టార్ క్యాంపైనర్ అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నామని... రూలింగ్‌లో ఉన్నప్పుడే ఏం చెయ్యలేకపోయామన్నారు. చిదంబరం జడ్జిమెంట్ కవిత విషయంలో సరిపోతుందన్నారు. ఏడేళ్ల లోపల పడే శిక్ష ఆధారాలకు అరెస్ట్ అవసరం లేదన్నారు. అరెస్ట్ సరయిన కారణాలు లేవని కవిత తరపున లాయర్లు వాదనలు వినిపించారు. అయితే కవితకు బెయిల్ ఇవ్వొద్దని సీబీఐ వాదనలు వినిపించింది. కవిత ప్రభావితం చేయగలుగుతారని.. లిక్కర్ కేసులో కవిత కీలక వ్యక్తిగా ఉన్నారని సీబీఐ తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి కావేరి బవేజ తీర్పును మే 2కు వాయిదా వేశారు.

## నేటి హనుమాన్ శోభాయాత్రకు పూర్తైన ఏర్పాట్లు.. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..



హైదరాబాద్: రేపు (మంగళవారం) హనుమాన్ జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంలో హనుమాన్ జయంతి శోభా యాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ క్రమంలోనే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. రేపు ఉదయం 11:20 గంటలకు ఆంజనేయుని శోభా యాత్ర ప్రారంభం కానుంది. ఈ ఊరేగింపు గౌలిగూడ రామ మందిరం నుంచి ప్రారంభమై.. తాడ్‌బండ్ సికింద్రాబాద్ మీదుగా గౌలిగూడ రామమందిరం, పుత్లిబౌలి క్రాస్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ క్రాస్ రోడ్, కోటి, సుల్తాన్ బజార్, రాంకోటి, కాచిగూడ, నారాయణగూడ, చిక్కడపల్లి మీదుగా కొనసాగనుంది. నగరంలో దాదాపు 12 కిలో మీటర్ల దూరం శోభ యాత్ర నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు తాడ్‌బండ్‌లోని హనుమాన్ మందిరం వద్ద యాత్ర ముగియనుంది.

మరో ఊరేగింపు కర్మన్‌ఘాల్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై చంపాపేట్ వద్ద హైదరాబాద్ నగర పరిధిలోకి ప్రవేశించనుంది. మూసారం బాగ్ జంక్షన్ – మలక్ పేట – నల్గొండ ఎక్స్ రోడ్ – అజంపురా రోటరీ – చాదర్ ఘాట్ ఎక్స్ రోడ్ మీదుగా డీఎంఅండ్‌హెచ్ఎస్ వద్ద ప్రధాన ఊరేగింపులో కలవనుంది. ఇక ఈ యాత్ర జరగనున్న ప్రదేశాలన్నింటిలోనూ ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

## గెలిపిస్తే సింగరేణి కార్మికుల పక్షాన ప్రశ్నించే గొంతుకనవుతా : కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం సాధించాక నాడు కేసీఆర్ సింగరేణి కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించారని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాల నియోజకవర్గం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌కే–7,ఆర్‌కే–7ఎన్‌టీ గనుల వద్ద కార్మికులతో కలిసి గేట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ..సింగరేణి కార్మికులు ఉద్యమ సమయంలో ఎంతో చురగ్గా పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చిన తర్వాత అనేక సమస్యలు పరిష్కరించడంతో బీఆర్ఎస్‌కు, సింగరేణి కార్మికులకు అవినాభావ సంబంధం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నది. దీనిని అడ్డుకోవాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. సింగరేణి కార్మికుడిగా 26 సంవత్సరాలు పని చేసిన అనుభవం ఉంది. నాకు ఒక్క అవకాశం ఇస్తే సింగరేణి కార్మికుల పక్షాన ప్రశ్నించే గొంతుకనవుతానని హామీనిచ్చారు.

## నా గొంతుని కాపాడండి.. మోసపోయి మీరు ఆగం కావొద్దు



సిద్దిపేట, ఏప్రిల్ 22: గెలుపే లక్ష్యంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ బీజేపీకి ఓటు వేయాల్సింది ప్రజలను కోరుతున్నారు. సోమవారం దుబ్బాకలో రఘునందన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ (%దీ=ూ%) నుంచి పోటీ చేస్తున్నటువంటి వ్యక్తి ఎవరు? ఆయనకు మెదక్ జిల్లాకు సంబంధమేంటి అని ప్రశ్నించారు. కలెక్టర్‌గా ఉన్నటువంటి వ్యక్తి మాజీ సీఎం కాళ్లు మొక్కి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఇప్పటి వరకు మూడు సంవత్సరాలు గడుస్తున్నా సంవత్సరానికి 100 కోట్ల చొప్పున నిధులు తీసుకురాని అసమర్ధత వ్యక్తి వెంకటరామిరెడ్డి అని మండిపడ్డారు. మల్లన్న సాగర్ ముంపు బాధితుడు మల్లారెడ్డి అనే వ్యక్తి తన ఇంట్లో ఉన్న మొగురాలు, వాసాలనే తన చితిగా పేర్చుకొని చనిపోయినప్పుడు చలించని వ్యక్తి అప్పట్లో కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అని అన్నారు. 30 మంది కలెక్టర్లలో ఈయనా ఒక కలెక్టర్ అని... కానీ జిల్లాకు ఊరగబెట్టిందేమీ లేదని వ్యాఖ్యలు చేశారు. డిపాజిట్ రానటువంటి వ్యక్తి కొబ్బరికాయలు, కత్తెర్లు పట్టుకొని వచ్చి తిరుగుతుంటే బీఆర్ఎస్ నాయకులు ఎక్కడికి పోయారని.. వాళ్ళ నోర్లు ఎందుకు తెరుస్తలేరని ప్రశ్నించారు. రఘునందన్ రావు శిలాఫలకాలకు కొబ్బరికాయలు కొడుతున్నానంటే 50 మంది బీఆర్ఎస్ నాయకులు వచ్చేవారని.. మరి ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. డిపాజిట్ రాని వ్యక్తి పథకాలు ప్రకటించుకుంటూపోతున్నారని విమర్శించారు. ఈరోజు దుబ్బాక క్యాంపు కార్యాలయంలో 5 నెలల నుంచి అందుబాటులో లేని వ్యక్తి కొత్త ప్రభాకర్ రెడ్డి అని అన్నారు. ఒక క్లర్క్‌ను కూడా క్యాంపు కార్యాలయంలో అందుబాటులో పెట్టలేదన్నారు. ఇప్పటి వరకు దుబ్బాక కార్యాలయంలోకి దుబ్బాక ఎమ్మెల్యే అడుగు పెట్టలేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు రఘునందన్ రావు ఎప్పటికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తప్పుడు వ్యక్తులైన బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. హోంగార్డులకు, అంగన్వాడీలకు ఆఖరికి జర్నలిస్టులకు డబల్ బెడ్రూంలు ఇళ్ల స్థలాలు కేటాయిస్తలేదని ప్రశ్నించిన గొంతుక రఘునందన్ రావు ది అని చెప్పుకొచ్చారు. "ఈ నా గొంతుని కాపాడండి వాళ్ళు ఇచ్చే డబ్బులకు ఈరోజు మోసపోయి మీరు ఆగం కావొద్దు" అంటూ రఘునందన్ రావు ప్రజలను కోరారు.

## రేవంత్ రెడ్డి కాదు.. ఆయన రోతంత రెడ్డి.. నిప్పులు చెరిగిన జగదీశ్ రెడ్డి



నల్లగొండ : సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి నిప్పులు చెరిగా రు. నిన్న తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు రోతగా ఉన్నాయన్నారు. ఆయన పేరు రేవంత్ రెడ్డి కాదు రోతంత రెడ్డి అని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం హోదాలో రేవంత్ మాట్లాడిన తీరు బాధాకరమన్నారు. రేవంత్ మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనబడిందని తెలిపారు. బ్లాక్ మెయిలింగ్ పాలిటిక్స్‌కు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్ అని పేర్కొన్నారు. రేవంత్ ముఖ్యమంత్రి పదవికి వాళ్ళ నేతలే ఎసరు పెడతారని తెలిపారు. కాంగ్రెస్ 160 రోజుల పాలనలో కరువు వచ్చింది, లక్షల ఎకరాల పంటలు ఎండిపోయాయి. మహిళలు బిందె పట్టుకుని మళ్ళీ రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ నుంచి రేవంత్ మోదీకి డబ్బు మూటలు పంపిస్తున్నాడని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. మోదీ తన సీఎం పీఠాన్ని కాపాడుతాడని రేవంత్ కలలు కంటున్నాడు. కోమటిరెడ్డి బ్రదర్స్‌ను రేవంత్ పొగుడుతుంటే ప్రజలే కాదు కాంగ్రెస్ నేతలు కూడా నవ్వుకుంటున్నారు. అద్దంకి దయాకర్, కొండేటి మల్లయ్య లాంటి వాళ్ళను దూరం పెట్టి.. బూతులు తిట్టిన కోమటిరెడ్డి బ్రదర్స్‌ను వెనకేసుకు రావడంలో ఆంతర్యమేంటి? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660